## క్లుప్తంగా

### పరిష్కార వేదికకు 9 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 9 అర్జీలను ఆర్డీవో దేవరకొండ అఖిలకు అందజేశారు. డివిజన్ పరిధిలో రీ సర్వేపై 3, మద్యం దుకాణాలపై 2, ఆక్రమణలు తొలగించాలని 1, దారి మార్గం కల్పించాలని మరొకటి, పంచాయతీల్లో పారిధ్యంపై మరొకటి అర్జీలను ఆర్డీవోకు అందజేశారు. వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు ఆర్డీవో కార్యాలయ అధికారులు వాటిని బదిలీ చేశారు.

### రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



తాతపూడి రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: భూ సర్వేలోని రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. తాతపూడిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సభలో ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సాంకేతిక పరమైన సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలంటూ భూ యాజమానులు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### మహిళలైనా, వృద్ధులైనా కర్ర దాటి వెళ్లాల్సిందే..



ద్రాక్షారామ భీమేశ్వరాలయ పడమర గోపురం వద్ద కర్ర దాటి వెళ్లడానికి ఆపసోపాలు పడుతున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి కార్తిక మాసంలో భక్తులు వెల్లువెత్తారు. ముఖ్యంగా కార్తిక సోమవారాల్లో అయితే లక్షల్లో భక్తులు తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉండటం సహజమే కానీ ద్రాక్షారామలో సోమవారం దేవాలయం, పోలీస్ శాఖలు చేసిన ఏర్పాట్ల వల్ల భక్తులు కొంచెం అసహనానికి గురయ్యారు. ఆలయ పడమర గోపురం వద్ద భక్తులు వెళ్లే దారిలో కర్ర అడ్డంగా పెట్టడంతో భక్తులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. కర్ర దాటి వెళ్లడానికి ఆపసోపాలు పడ్డారు. మళ్లీ వచ్చే కార్తిక సోమవారానికైనా ఇటువంటి ఇబ్బంది భక్తులు పడకుండా ఏర్పాట్లు చేయాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి



దోషులను కఠినంగా శిక్షించాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

కాజులూరు: మండలంలోని శలపాకలో గత నాలుగు రోజుల క్రితం జరిగిన దారుణ హత్యలను ఖండిస్తూ సోమవారం గ్రామస్తులు నిరసన ర్యాలీ చేపట్టారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గ్రామానికి చెందిన పొట్లకాయల నాగేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు గత గురువారం రాత్రి ఎదురు ఇంటిలో ఉంటున్న బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌లపై ఇనుపరాడ్లతో దాడి చేసి హతమార్చారు. ఈ సంఘటనపై నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దుండగులను కఠినంగా శిక్షించాలంటూ గ్రామస్తులు ఆందోళనలకు దిగారు. అధిక సంఖ్యలో స్థానిక మహిళలు, ప్రజలు గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ వరకూ పాదయాత్ర ద్వారా ర్యాలీ నిర్వహించి గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పలువురు బైక్‌లపై ర్యాలీగా కాకినాడ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పరిసర గ్రామాలకు చెందిన పలువురు స్థానికులు సైతం నిరసన ర్యాలీకి మద్దతు తెలిపారు.

# ధన ధాన్యాల కల్పవల్లి ధనమ్మతల్లి



ధనలక్ష్మి అమ్మవారు



ధనమ్మ మర్రి ఊడల మధ్యలో ధనమ్మ తల్లి ఆలయం



విస్తరించి ఉన్న ధనమ్మ మర్రి ఊడలు



సంతాన ప్రాప్తి కోసం భక్తులు మొక్కే ఊయల

- సంతాన ప్రాప్తికి అమ్మవారి ఉయ్యాలకు పూజ
- కోరిన కోర్కెలు కోసం ముడుపుల చెల్లింపు
- గోదావరి అందాలకు నిలువుటద్దం మర్రి క్షేత్రం
- సమీపంలోని ప్రసిద్ధ ఆలయాలనూ సందర్శించవచ్చు

కపిలేశ్వరపురం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ధనమ్మ తల్లి... ధన, ధాన్యాల కల్పవల్లిగా ప్రసిద్ధి... ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక క్రతువులకు నిలువుటద్దం ధనమ్మమర్రి క్షేత్రం... అమ్మ క్షేత్రం అలనా పాలనా ఒకనాటి మానవ సామాజిక జీవనానికి ప్రతీక... కులాలకు అతీతంగా అమ్మ ఆశీర్వాదమే ఆశయంగా సేవ చేస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న ధనమ్మమర్రి విశిష్టతపై ఈ కథనం...

**ప్రకృతి అందాల దర్శనం**

తీవ్ర కరవు కాటకాలున్న రోజుల్లో సమీప గ్రామాల ప్రజలను అమ్మవారు ఆదుకోవడం, అమ్మవారి అక్కచెల్లెళ్లు మర్రి ఊడల నడుమ నడియాడారన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారు. రెండున్నర ఎకరాల గోదావరి లంక భూమిలో అమ్మవారి క్షేత్రం వర్ధిల్లింది. గౌతమి గోదావరి తీరాన ఉన్న క్షేత్రం పచ్చటి ఉద్యాన వన పంటల నడుమ ఆహ్లాదకరంగా కనువిందు చేస్తుంది. అందుకే ఈ క్షేత్రం ఆధ్యాత్మికంగానూ, పర్యాటకంగానూ పేరొందింది. అమ్మ వెలసినట్టు గుర్తించిన లంక గ్రామాల వాసులు తమకు తోచిన పద్ధతుల్లో మర్రి చెట్టుకు పూజలు చేసేవారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణమంతా మర్రి ఊడలతో అటవీ ప్రాంతాన్ని తలపించేదిగా ఉండేది. అమ్మ దర్శనం బహుముఖ ప్రయోజనం కావడంతో కోనసీమ వాసులతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి రావడం ఆరంభమైంది. తర్వాత కాలంలో కపిలేశ్వరపురం జమీందారీ వంశస్తులు అమ్మవారి ఆలనాపాలనా చూస్తూ ధనమ్మ మర్రి క్షేత్రంగా అభివృద్ధి చేస్తూ వచ్చారు. సమీప గ్రామాల ప్రజలు తమ ఇంటి ఆడపడుచుగా అమ్మవారిని కొలుస్తూ ఆమె ఆలనా పాలనలో భాగస్వాములవుతున్నారు.

**దర్శన ప్రాధాన్యతలివీ...**

ఆది, మంగళ, బుధవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. వివాహం అయిన తొలిరోజు దంపతులు అమ్మవారిని దర్శించుకోవడం ఆచారం. లంక గ్రామాల ప్రజలు తమ ఉద్యాన పంటల దిగుబడి కాలంలో తొలి పండు, గింజ, కాయ, పుష్పం తదితర ఉత్పత్తులను అమ్మవారికి సమర్పించుకుంటారు. వ్యాపార రంగంలోకి ప్రవేశించినవారు అమ్మ దర్శనాన్ని తీసుకొంటారు. మహిళలు తాము కొనుక్కున్న బంగారు ఆభరణాన్ని అమ్మవారి మెడలో వేసి పూజలు చేసి తీసుకెళ్తుంటారు. బారసాల రోజున, పిల్లలకు పేర్లు పెట్టించుకునేందుకు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. సంతాన లేమిగల దంపతులు ఆలయ ప్రాంగణంలోని ఉయ్యాలను ఊపి, ముడుపులను మర్రి చెట్టుకు కట్టి సంతాన ప్రాప్తికి మొక్కుకుంటారు.

**ఇలా చేరుకోవచ్చు**

రావులపాలెం నుంచి ఏడు కిలోమీటర్ల దూరాన కొత్తపేటకు ముందున్న బోడిపాలెం వంతెనకు చేరుకోవాలి. అక్కడ నుంచి గోదావరి నది వైపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ధనమ్మమర్రికి కాలినడకన కానీ, ప్రైవేట్ వాహనాల్లో కాని వెళ్లాలి. సొంత వాహనాల్లో వెళ్లడం సౌకర్యవంతంగా ఉంటుంది.

**సమీప ఆధ్యాత్మిక కేంద్రాలు ఇవీ**

ధనమ్మమర్రికి సమీపాన విశిష్ట ఆలయాలున్నాయి. దూరపు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పలు ప్రాంతాల్లో ఉన్న ఇతర దేవతామూర్తులను సైతం దర్శించుకునేందుకు అనువుగా ఉంటుంది. ధనమ్మ మర్రికి 10 కిలోమీటర్ల దూరంలోని వానపల్లిలో పళ్ళాలమ్మ అమ్మవారి ఆలయం, నాలుగు కిలోమీటర్ల దూరంలోని మందపల్లిలో శనీశ్వరస్వామి ఆలయం, 12 కిలోమీటర్ల దూరంలోని వాడపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, 15 కిలోమీటర్ల దూరాన ర్యాలిలోని జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాలను దర్శించుకునేందుకు సొంత వాహనాల ప్రయాణమే సౌకర్యం.

### ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొండా వెంకన్న

కాజులూరు: త్వరలో జరుగనున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులందరూ ఓట్లు నమోదు చేసుకునేలా స్థానిక నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న అన్నారు. సోమవారం కోలంకలోని తన కార్యాలయంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో బొండా వెంకన్న సమావేశం ఏర్పాటు చేసి నాయకులకు ఓట్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ నెల ఆరో తేదీ ఓటరు నమోదుకు గడువు ముగుస్తుందని మండల గ్రామాల్లో 31 అక్టోబరు 2021 తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఓటు నమోదు చేసుకునేలా నాయకులు పట్టభద్రులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఇంటి తాళం బద్దలుగొట్టి బంగారు ఆభరణాల చోరీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి లలితాదేవి కార్తిక సోమవారం కావడంతో గ్రామంలోని మార్కండేయ స్వామి ఆలయానికి తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు ఇంటికి తాళం వేసుకుని దర్శనానికి వెళ్లింది. అయితే ఆమె తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం బద్దలుగొట్టి ఉన్నట్లు గుర్తించి ఆందోళనతో ఇంటిలోకి వెళ్లి చూసేసరికి 60 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగతనానికి గురయినట్లు గుర్తించి ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు.

# సోమేశ్వరంలో వైభవంగా పడిపూజ



సోమేశ్వరంలో అయ్యప్ప పడిపూజను చేస్తున్న భక్తులు



నల్లూరులో పేటతుళ్లి ఆడుతున్న అయ్యప్ప మాలధారులు

రాయవరం: సోమేశ్వరంలో వైభవంగా అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన గరగ శ్రీనివాసరావు, గరగ సోమన్న స్వాములు శబరిమల యాత్రను పరస్కరించుకుని ఆదివారం పడిపూజ, లక్ష బిల్వార్చన నిర్వహించారు. తాడాల వీరవెంకటరావు గురుస్వామి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కేరళ వాయిద్యాలతో పేటతుళ్లి నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు తోట శివశంకరరావు గురుస్వామిచే పడిపూజ, లక్ష బిల్వార్చన నిర్వహించారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాలకు చెందిన రెండు వేల మంది అయ్యప్పలు పాల్గొన్నారు.

**అయ్యప్ప మాలధారుల పేటతుళ్లి**

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు గ్రామంలో అయ్యప్ప మాలధారులు గ్రామ వీధుల్లో పేట తుళ్లి యాత్ర చేశారు. పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో స్వామిని కీర్తిస్తూ, స్మరిస్తూ ఊరేగింపుగా సాగారు. చిన్నారులు అయ్యప్ప స్వామి వేషధారణలో అలరించారు.

# సంగమేశ్వరంలో 'తోట' దంపతుల పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు

మండపేట: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని ఏడిద సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తికమాసం ప్రారంభమైనందున కార్తిక తొలి సోమవారాన్ని పురస్కరించుకుని స్వయంవర పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. తొలుత అధికారులు ఆలయ మర్యాదలతో తోట దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి రాంబాబు, రామిశెట్టి శ్రీహరి, చిలుకూరి బుజ్జి, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్య భాస్కరరావు, వాసిరెడ్డి అర్జున్, సాధనాల శివ, తణుకు అశోక్, పమిడిపల్లి నానాజీ పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించండి

**సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి**



వాకతిప్ప పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంతి

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య సేవల మెరుగుపరిచే లక్ష్యంతో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని రామచంద్రపురం సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి ఆదేశించారు. వాకతిప్ప పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవల వివరాలను వైద్యులు డాక్టర్ పి.చంద్రమౌళి, డాక్టర్ సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి వివరించారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమవేశమయ్యారు. త్వరలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ పీహెచ్‌సీని సందర్శించబోతుందని ప్రకటించారు. పీహెచ్‌సీలోని ఫార్మసీ, ల్యాబొరేటరీ, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, లేబర్ రూమ్‌లను శాస్త్రీయంగా నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయాలన్నారు. పీహెచ్‌సీలోని రికార్డులు, హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సునీత, రామచంద్రపురం డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, ఎంపీహెచ్‌ఈఓ పీడీడీ బిషప్, ఎంపీహెచ్‌ఎస్ వీఎస్ కామేశ్వరరావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం ఇరువురు దాతలు విరాళాలు అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్లకూరుకు చెందిన దాత అడ్డాల వంశీరాజు, వెంకటస్వాతి దంపతులు రూ.25,116, తుని పట్టణానికి చెందిన దాత వెలవెల సాయిసమీర్, భవ్యమంజు దంపతులు రూ.25,000 విరాళాలు అందజేశారు. ఈ మేరకు పై మొత్తాలను దాతలు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథికి ఇచ్చి, స్వామివారి చిత్రపటాలను దాతలు అందుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హరోం హరా..శంకరా

- శైవాలయాల్లో ప్రతిధ్వనించిన ఓంకారం
- సోమేశ్వరంలో జ్యోతిర్లింగార్చన



సోమేశ్వరంలో పుష్పాలంకృతులై అలరారుతున్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



సోమేశ్వరం గజచర్మధారిగా ఉన్న లింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



రాయవరంలో పుష్పాలంకృతులైన పార్వతీ సమేత రాజేశ్వరస్వామివారు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగం వద్ద దీపాలు వెలిగించి నమస్కరిస్తున్న భక్తులు

రాయవరం: కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో మండలంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. శివాలయాల్లో ఓంకారం ప్రతిధ్వనించింది. అభిషేకాలు, అర్చనలతో లయకారుడైన బోళా శంకరుణ్ని భక్తజనం స్తుతించి తరించింది. మండలంలోని పలు శివాలయాలు భక్త జన సందోహంతో కిటకిటలాడాయి. వేకువజామున రెండు గంటల నుంచే భక్తులతో పోటెత్తాయి. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వర స్వామి, రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి, చెల్లూరు బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి తదితర శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. రుద్రుడికి భక్తులు పంచదార, తేనె, పసుపు, కుంకుమ, విభూది, చందనం, పాలు, పెరుగు, ఆవు నెయ్యి పండ్లరసాలతో అభిషేకించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేకువజామున భక్తులతో ప్రారంభమైన క్యూలైన్లు ఉదయం 11 గంటల వరకు కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాస దీక్షను చేపట్టిన పలువురు మహిళా భక్తులు సాయంత్రం సమయాల్లో పురోహితులకు స్వయంపాకం అందజేసిన అనంతరం ఉపవాస దీక్ష విరమించారు. స్వయంపాకంతో పాటు కొందరు దీపాలను దానం చేశారు. ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించడంతో ఆలయాలు దీప శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

**జ్యోతిర్లింగార్చన**

పలు దేవాలయాల్లో భక్తులు జ్యోతులను వెలిగించారు. పలు ఆలయాలు దీపశోభతో అలరారాయి. సోమేశ్వరం శివాలయంలో బైరిశెట్టి సత్యనారాయణ, పాపాయమ్మ దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన చేశారు. శివలింగం, త్రిశూలం తదితర ఆకృతుల్లో జ్యోతులను వెలిగించారు. భక్తులు తన్మయత్వంతో జ్యోతిర్లింగార్చనలో పాల్గొన్నారు.

**అగస్త్యేశ్వరస్వామికి క్షీరాభిషేకం**

మండపేట: కార్తిక మాసంలోని తొలి సోమవారం కావడంతో పట్టణంలో కొలువైన జనార్దన అగస్త్యేశ్వరస్వామి వారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్య సుబ్రహ్మణ్యేశ్వరశర్మ స్వామి వారిని ఆవు పాలతో అభిషేకించారు. పట్టణం నుంచి మహిళలు పెద్దఎత్తున స్వామి దర్శనానికి తరలి వచ్చారు. మహిళలు ఉదయాన్నే నదీ స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మండపేటలో శివునికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

### శివోహం..

రామచంద్రపురం రూరల్: కార్తిక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో మొదటి కార్తిక సోమవారం పురస్కరించుకుని ఓం నమశ్శివాయ నినాదాలతో మార్మోగింది. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుని సప్త గోదావరిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర పాలకుడైన లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకుని భీమేశ్వరస్వామి, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చిన్నారులకు పాలు అందించే ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీటి సదుపాయం కల్పించారు. వృద్ధులు, చంటి బిడ్డల తల్లులు, వీఐపీలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములకు సంబంధించిన ప్రత్యేక పూజలు రుత్వికులతో నిర్వహింపజేసుకున్నారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాలలో ఆవు నెయ్యి వత్తులను వినియోగించి స్త్రీలు దీపారాధన నిర్వహించడం ద్వారా కార్తిక మాస విశిష్టతను, వ్రత మహత్యాలను తెలుసుకున్నారు. ఆలయ సిబ్బంది, ఇతర దేవాలయాల నుంచి వచ్చిన సిబ్బంది, స్థానిక వలంటీర్లు, భక్తులకు తగిన వసతులు కల్పించారు.